www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 25 డిసెంబర్ 2023

5

కాకినాడ

కల్వర్టు సరే..ఈ అడ్డంకులు ఏంటీ..?

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మార్గమధ్యలో ఉన్న ఇసుక, ముళ్ల కంచె కంపలు

రాకపోకలు ప్రారంభం అయ్యి 2 వారాలు అవుతోంది. అయితే రోడ్డుపై అడ్డుగా ఉన్న ఇసుకను, ముళ్లకంపను నేటికీ తొలగించిన పరిస్థితి లేదు. దీంతో రోడ్డుపై వెళ్లే ద్విచక్రవాహనదారులు ఇసుకపై వెళ్తూ జారీ ప్రమాదాల భారిన పడుతున్నారు.

ప్రజారోగ్యంతో ఆటలు..!

- తీరంలో వ్యర్థ రసాయనాల విడుదల
- కాలువల్లో యథేచ్ఛగా మల విసర్జనాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

సామర్లకోట మండలం ఎడిబి రోడ్డు మార్గంలో వికె.రాయపురం-మాధవపట్నం మధ్య ఒక పంట కాలువలోకి సెప్టిక్ ట్యాంక్ ద్వారా వ్యర్థాలను వదులుతున్నారు. గత కొన్నేళ్లుగా ఈ తంతు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇటీవల కొంతమంది స్థానికులు సెప్టిక్ ట్యాంకు నిర్వాహకులు అడ్డుకోవడంతో వివాదం చోటుచేసుకుంది. అలాగే కాకినాడ సముద్ర తీరం, బీచ్‌కు వెళ్లే ఎడిబి రోడ్డు మార్గంలో అనేకమంది వివిధ వ్యర్థాలను విచ్చలవిడిగా పారబోస్తున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా గత కొన్ని సంవత్సరాలుగా హానికర వ్యర్థ జలాలు, రసాయనాలు, ఫార్మా కంపెనీల నుంచి వస్తున్న వ్యర్థాలు, సెప్టిక్ ట్యాంకుల ద్వారా మల విసర్జనాలను విచ్చలవిడిగా వదులుతున్నా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. వ్యర్థాలను యథేచ్ఛగా ఎక్కడపడితే అక్కడ వదులుతున్నా అధికార యంత్రాంగం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి.

వివిధ ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న హానికర ఫార్మా కంపెనీల వ్యర్థాలను, వ్యర్థ రసాయన జలాలను కాకినాడ తీరం చుట్టుపక్కల ప్రాంతాల్లో కొందరు పారబోస్తున్నారు. దాంతో ఆయా ప్రాంతాల్లో గాలి, నీరు, వాతావరణం కలుషితమై తరచూ అనారోగ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. విషవాయువులు పీల్చడం వలన దీర్ఘకాలిక రోగాల భారిన పడుతున్నామని కాకినాడ రూరల్ మండలానికి చెందిన పెండ్రాసి, రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీర ప్రాంతంలో ఉన్న ఎడిబిల ఆయిల్ పరిశ్రమలకు నిత్యం వందలది ట్యాంకర్లు ద్వారా ఆయిలు ఎగుమతి, దిగుమతి చేస్తుంటారు. ఇవి అక్రమంగా కొన్ని ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన వ్యర్థ జలాలను తీరంలో కొన్ని పరిసర ప్రాంతాల్లో విచ్చలవిడిగా వదులుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరూ సంచరించని అర్ధరాత్రి సమయాల్లో ఈ వ్యవహారం ఎక్కువగా జరుగుతోందని విమర్శలు ఉన్నాయి. కత్తిపూడి నుంచి కాకినాడ మధ్య జాతీయ రహదారిపై గతంలో ఈ వ్యవహారం ఎక్కువగా జరిగేది. అయితే పోలీసులు తరచూ పెట్రోలింగ్ నిర్వహిస్తుండడంతో అక్రమార్కులు బీచ్ రోడ్డును ఎంపిక చేసుకుని వ్యర్థాలను విడిచి పెడుతున్నారు. మరోవైపు ట్యాంకర్లను శుభ్రం చేసే సర్వీసింగ్ సెంటర్ల ద్వారా వదులుతున్న జలాలు చుట్టుపక్కల కాలువల్లోకి చేరుతున్నాయి. వీటి ద్వారా సముద్రంలోకి నేరుగా వ్యర్థ జలాలు వెళుతున్నాయి. గతేడాది ఒక పరిశ్రమ నుంచి ఫార్మా వ్యర్థ జలాలు వదులుతున్నట్లు స్థానికులకు ఫిర్యాదు రావడంతో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరిశీలించి శాంపుల్స్‌ను సేకరించారు. నిబంధనల ప్రకారం కాలుష్య పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను శుద్ధిచేసి వాటిని వ్యవసాయ, ఇతర అవసరాలకు వాడాల్సి ఉన్నా పలు పరిశ్రమల యాజమాన్యాలు ఇవేమీ పట్టించుకోవడం లేదు. నేరుగా హానికర వ్యర్థాలను బయటకు వదిలేస్తూ నిబంధనలను అతిక్రమిస్తున్నారు. నిరంతరం ఈ వ్యవహారం యథేచ్ఛగా జరుగుతున్నా సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తీరంలో వ్యర్థ రసాయనాలు, మల విసర్జన వ్యర్థాల నిర్మూలనపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎడిబి రోడ్డులో కాలువలోకి సెప్టిక్ ట్యాంకు నుంచి వదిలేస్తున్న మల వ్యర్థాలు

ఎడిబి రోడ్డులో వివిధ రసాయనాలతో కూడిన లారీలు

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, ఇతర నాయకులు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

-ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ

డిసెంబర్ 27, 28, 29 తేదీల్లో కాకినాడలో జరుగుతున్న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఎపి 24వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని అంబేద్కర్ భవన్ వద్ద ఆదివారం రాష్ట్ర మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడం కోసం విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ఉన్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమాలను రూపొందించుకోవడం కోసం ఈ మహాసభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహాసభలకు ఎస్ఎఫ్ఐ జాతీయ నాయకులు, పిడిఎఫ్ ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణ రావు, ఐళ్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా, వ్యతిరేక విధానాలను చర్చిస్తామని, ఈ మహాసభలో వచ్చే రెండు ఏళ్ళ కాలంలో ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం ఏ కార్య క్రమాలు నిర్వహించాలనే అంశాలపై చర్చించి భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకుంటామన్నారు. ఈ మహాసభ కాకినాడ నగరంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఆంధ్రప్రదేశ్ 24వ రాష్ట్ర మహాసభలకు అల్లూరి సీతారామరాజు చదివిన నగరం, పేద విద్యార్థులకు చదువు అందించడం కోసం తమ ఆస్తిని మొత్తాన్ని విద్యకు దానం చేసిన మల్లాడి సత్యలింగ నాయకర్, పిఠాపురం రాజా స్ఫూర్తితో కాకినాడలో మహాసభలు నిర్వహించడం చారిత్రాత్మక ఘట్టమన్నారు. ఈ మహాసభలు జయప్రదం చేయడం కోసం జిల్లాలో ఉన్న విద్యావేత్తలు, ప్రముఖులు, రాజకీయనేతలు, విద్యార్థులు, విద్యారంగ శ్రేయోభిలాషులు సహకరించాలని కోరారు. ఈ మహాసభ జయప్రదం కోసం తమ వంతు పాత్ర పోషించాలని కాకినాడ జిల్లా విద్యార్థి లోకాన్ని కోరారు. ఈ మహాసభలు అనంతరం 29వ తేదీ మధ్యాహ్నం ఆనంద్ భారతి గ్రౌండ్ నుంచి మెక్లారిన్ గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, బహిరంగ సభ నిర్వహిస్తామని ఈ బహిరంగ సభకు, ర్యాలీకి విద్యార్థులు అందరూ తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.రాజా, జిల్లా అధ్యక్షులు వరహాలు, జిల్లా నాయకుల శ్రీకాంత్, వాసు, సాహిత్, గోపాలకృష్ణ వెంకటేశ్, ఆదర్శ కార్తీక్, జయరాం, రాజేష్, మణికంఠ, సాహిత్, లోవతల్లి, అమృత, మానస, భవాని, హేమ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రమణయ్యపేట, రాయుడుపాలెం క్రీస్తు సంఘం చర్చిలో క్రిస్టమస్ వేడుకలను పురస్కరించుకుని అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో వృద్ధులకు నూతన వస్త్రాల పంపిణీ చేశారు. క్రిస్మస్ పండుగ సమయంలో దానధర్మాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని నిర్వాహకులు వెంకట్రావు తెలిపారు. ఆ దిశగా ప్రతి ఏటా క్రిస్మస్ వేడుకల సందర్భంగా పలు చర్చిలలో నూతన వస్త్రాలు సమకూరుస్తున్న అడబాల రత్న ప్రసాద్ సేవా నిరతి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సువార్తకుడు పంపన ఏసురత్నం, డాక్టర్ కె.వెంకటరమణ, రాఘవరావు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

రాజేశ్వరి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - పిఠాపురం

మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దేవరపల్లి రాజేశ్వరి పిఠాపురం పట్టణానికి చేసిన సేవలు మరువలేనవని ఎంఎల్ఎ పెండెం దొరబాబు అన్నారు. నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మేడిది వెంకట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాజేశ్వరి 14వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిచారు. తొలుత ఆర్ఆర్ పార్క్‌లో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేశ్వరి మున్సిపాలిటీకి ప్రథమ మహిళా చైర్‌పర్సన్‌గా పనిచేసి పట్టణాన్నీ ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఆవిడ లేని లోటు మరువరానిదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ఎన్.వర్మ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, ఎం.రాంబాబు, పి.ఇందిరా, గండేపల్లి బాబి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి యూత్ అధ్యక్షునిగా నానిబాబు

ప్రజాశక్తి - కోటనందూరు

వైసిపి మండల యూత్ అధ్యక్షుడుగా కెఇ.చిన్నయ్యపాలెంకు చెందిన బండి నానిబాబును నియమించినట్లు ఎంపిపి లగుడు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఉత్తర్వులు మేరకు నాని బాబుని ఏకగ్రీవంగా యూత్ అధ్యక్షుడుగా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నాని బాబు మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించిన మంత్రి దాడిశెట్టి రాజా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫిజియోథెరిఫీ చేస్తున్న శ్రీరామమూర్తి

శీతాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

శీతాకాలంలో ప్రజలకు ఎక్కువగా ముఖ పక్షవాతం వచ్చే ప్రమాదం ఉందని, బయట ఎక్కువగా తిరిగే వారు, దిచక్ర వాహనాలపై ప్రయాణం చేసేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఫిజియోథెరపీ డాక్టర్ జి.శ్రీరామమూర్తి అన్నారు. ప్రస్తుత శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన ఆదివారం 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. చలిగాలిలో తిరిగే వారిలో ఫేషియల్ నరాలకు చలి గాలి ఎక్కువ తగలడం వలన ఆ నరం ఒత్తిడికి గురై ముఖ కండరాలు పక్షవాతానికి గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ వ్యాధికి ఫిజియోథెరపీ చికిత్స ద్వారా చాలావరకు నయమవుతుందన్నారు. వ్యాధి వచ్చిన మొదట్లోనే సరైన పద్ధతిలో ఫిజియోథెరపీ చికిత్స మొదలుపెడితే మూతి పక్కకి పోవడం, కనురెప్ప మూత పడకపోవడం వంటి పరిస్థితులను నివారించవచ్చని తెలిపారు. ఈ వ్యాధి లక్షణాల్లో ముఖ్యంగా నోటి నుంచి చొంగ కారడం, చెవి నొప్పి, తిండి సరిగా తినకపోవడం, సరిగ్గా నడవలేక పోవడం, సరిగ్గా మాట్లాడలేకపోవడం, మూతి పక్కకి పోవడం, కనురెప్ప మూత పడక పోవడం వంటి పరిస్థితి ఉంటుందన్నారు. ఇటువంటి లక్షణాలు కనిపిస్తే ఫిజియోథెరపీ చికిత్స మొదలు పెట్టాలని సూచించారు.

విజిల్స్ వేస్తూ వినూత్న నిరసన

ప్రజాశక్తి - యంత్రాంగం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మెకు దిగిన అంగన్‌వాడీలు రోజుకో రీతిలో తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం నాటికి అంగన్‌వాడీల సమ్మె 13వ రోజుకు చేరింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన నిరసన శిబిరాల్లో అంగన్‌వాడీలు ఈళలు వేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో ఒంటికాలిపై నిల్చుని నినదించారు. **పెద్దాపురం** స్థానిక మున్సిపల్ సెంటర్‌లో నిర్వహిస్తున్న సమ్మె శిబిరం వద్ద అంగన్‌వాడీలు విజిల్స్ ఊదుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి సమస్యలను పరిష్కరించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మాజీ కౌన్సిలర్, ఐద్వా నాయకులు కూనిరెడ్డి అరుణ అంగన్‌వాడీల ఉద్యమానికి మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి దాడి బేబీ, ఎస్తేరురాణి, నాగమణి, అమల, టిఎల్.పద్మావతి, కాలే దేవి, జె.కుమారి, జ్యోతి, లోవతల్లి, వసంతకుమారి, వెంకటలక్ష్మి, నాగమణి, సావిత్రి, రత్నం, లక్ష్మి, లోవ కుమారి, మహాలక్ష్మి, మంగాలక్ష్మి, రజని, స్నేహలత తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ** నగరంలోని కలెక్టరేట్ సమీపంలో చేపట్టిన నిరసన శిబిరంలో జరిగిన ధర్నాలో తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ ధర్నాను యూనియన్ జిల్లా కోశాధికారి జి.రమణమ్మ ప్రారంభించారు. సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ, సిఐటియు జిల్లా నాయకులు మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ అంగన్‌వాడీల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో వారు చేస్తున్న సేవలను గుర్తించి వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫుడ్ కమిషనర్ విద్యా ప్రతాపరెడ్డి అంగన్‌వాడీలపై చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయ, జోగంబ, దీప్తి, రమ, మున్ని, సత్యవేణి, నీరజ, జ్యోతి, సరోజ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. **కరప** స్థానికంగా జరుగుతున్న అంగన్‌వాడీల దీక్షా శిబిరంలో ఒంటి కాలిపై నిల్చుని నిరసనను వ్యక్తం చేశారు. ఈ శిబిరాన్ని మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబు దంపతులు, మాజీ ఎంపిపి గుళ్ళపల్లి శ్రీనివాసరావు, నాయకులు చాట్రా ఇమానీలు, మద్దూరు స్వామి, కాకర్ల బుజ్జిబాబు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.వీరవేణి, ఎస్.వరలక్ష్మి, ఎస్-ఎస్.కుమారి, దైవకుమారి, అచ్చారత్నం, తదితరులు పాల్గొన్నారు. **కిర్లంపూడి** స్థానిక తహశీల్దార్ కార్యాలయ సమీపంలో జరుగుతున్న అంగన్‌వాడీల నిరసన శిబిరంలో రిలే నిరహారదీక్షను కొనసాగించారు. తమ సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మెను విరమించేది లేదని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్.రత్నం, పి.సావిత్రి, షేక్ పరివిన్, జి.రత్నం, పి.మంగాయమ్మ, పి.ప్రభావతి, హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు. **జగ్గంపేట రూరల్** స్థానికంగా జరుగుతున్న అంగన్‌వాడీల నిరసన శిబిరాన్ని మండల యుటిఎఫ్ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. నిమ్మ రసం ఇచ్చి ఆదివారం దీక్ష ను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఆది సత్యనారాయణ, మధు, యూనియన్ నాయకులు రత్నం, సుజాత, తదితరులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** స్థానికంగా జరుగుతున్న అంగన్‌వాడీల నిరసన శిబిరాన్ని యుటిఎఫ్ జిల్లా నాయకులు జి.వీరబాబు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల సెక్టర్ అధ్యక్షురాలు కాకరపల్లి సునీత మాట్లాడుతూ మహిళలు 13 రోజులుగా రోడ్లెక్కి ఆందోళనలు నిర్వహిస్తున్న సిఎం జగన్‌కు చీమకుట్టినట్టైనా లేదన్నారు. ఎన్నికలకు ముందు నా అక్కలు చెల్లెమ్మలు అన్నా ఆయన నేడు తమ సమస్యలను పరిష్కరించమంటే ఏమాత్రం స్పందించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎన్.అమలావతి, సిహెచ్.వెంకటలక్ష్మి, జె.రాణి, పి.నూకరత్నం, ఆర్. రత్నకుమారి, పి.దుర్గాసూర్యకుమారి, కె.రమ్య, పి.గంగాభవాని, కె.బంగారు పాప తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** స్థానికంగా జరుగుతున్న అంగన్‌వాడీల రిలే నిరహారదీక్షలు కొనసాగాయి. ఈ దీక్షా శిబిరాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కెఎస్.శ్రీనివాస్, టేకుమూడి ఈశ్వరరావు సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, ప్రజా సంఘాల నాయకులు తణుకు రాంబాబు, మందనక్క తణుకు రాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో విజిల్స్ వేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

కరపలో ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ కార్యకర్త పరిస్థితి విషమం

ప్రజాశక్తి - కరప

మండలం గురజనాపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఎం.మంగాదేవి శనివారం రిలే నిరాహార దీక్షలో కూర్చుని సాయంత్రం ఇంటికి వెళ్లింది. ఇంటికెళ్లిన వెంటనే ఆమె ఒక్కసారిగా పడిపోవడంతో కుటుంబీకులు ఆమెను 108 వాహనంలో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె పరిస్థితి విషమించిందని వైద్యం అందించేందుకు వైద్యులు నిరాకరించారు. ఈ నేపథ్యంలోనే అక్కడే ఉన్న ఓ కానిస్టేబుల్ అంగన్‌వాడీ కార్యకర్తగా గుర్తించి రిలే నిరహారదీక్షలో ఉన్నారని వైద్యులకు వివరించారు. దీంతో ఆమెకు ప్రాథమిక వైద్యం అందించిన అనంతరం కుటుంబీకులు ఆమెను ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ప్రయివేటు ఆసుపత్రిలో ఐసియులో వైద్య చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా ఆమె భర్త ఎం.సూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం వారిపై నిరంకుశంగా వ్యవహరిస్తుందని, వారు సమస్యల పరిష్కారం కోసం రోడ్డున పడి ప్రాణాల మీదకు తెచ్చుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ రూరల్ అంగన్వాడి సెక్టార్ నాయకురాలు. పి.వీరవేణి మాట్లాడుతూ 13 రోజుల నుంచి న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం తీరు ఇప్పటికీ వరకు మారలేదన్నారు.

ఐసియులో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ

కార్టూ'నిజం'



నిరుద్యోగ దినోత్సవ శుభాకాంక్షలు సార్!!!

భూ హక్కుల చట్టం-2023ని రద్దు చేయాలి

- ఐలు రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజల రాజ్యాంగబద్ధ, చట్టబద్ధ ఆస్తి హక్కును హరించే ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను వెంటనే రద్దు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక యుటిఎఫ్ హాల్లో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం ఐలు జిల్లా అధ్యక్షులు మేడపాటి ధర్మారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూమి హక్కుల యాజమాన్య చట్టం 27/2023 అక్టోబర్ 31 నుంచి అమల్లోకి తెచ్చింద న్నారు. ఈ చట్టం ద్వారా భూమి హక్కుల యాజమాన్యంలో సమూల మార్పులు చేస్తూ రెవెన్యూ అధికారులకు (ల్యాండ్ టైటిలింగ్ అథారిటీ) భూమిపై హక్కులు నిర్ధారించే అధికారం సంక్రమింప చేసిం దన్నారు. ఇది ప్రజల రాజ్యాంగబద్ధమైన, చట్టబద్ధమైన భూమి హక్కులకు తీవ్ర విఘాతం కలగజేస్తుందన్నారు. అందుకే న్యాయవాదులు దీనిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు భూ వివాదాలు వచ్చిన నేపథ్యంలో స్థానిక సివిల్ కోర్టుల ద్వారా పరిష్కరించుకునే వారన్నారు. వీటికి అపీల్స్ కూడా కోర్టు పరిధిలోనే ఉండేవన్నారు. చట్టంలో న్యాయవ్యవస్థకు ఉన్న అధికారాలను తొలగించి పూర్తిగా రెవెన్యూ అధికారులే ఆస్తి హక్కులను నిర్ధారించడం, వివాదాలు పరిష్కరించడం, సహజ న్యాయ సూత్రాల ప్రాతిపదికగా నిర్ధారణకు రావడం తగద న్నారు. ఈ చట్టం గురించి ప్రజల ప్రజలకు అవగాహన కల్పించడానికి ఐక్యంగా కృషి చేయాలని నిర్ణయించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఐలు ప్రతినిధులు గుదిమెళ్ళ భాస్కరాచార్యులు, ఎకెఎస్. మల్లేశ్వరరావు, ఆర్‌జివి. పట్నాయక్, చెక్క శ్రీని వాస్, ఎం.జవహర్ అలీ, రామచంద్ర రాజు, కె.నాగజ్యోతి, సిపిఎం నాయకులు దువ్వా శేషబాబ్జీ, ఆర్.పి.ఐ(అంబేద్కర్) రాష్ట్ర కార్యదర్శి పిట్ట వరప్రసాద్, ఆర్‌సిపిఐ నాయకులు సతీష్, దళిత సంఘం నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.సింహాచలం, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కె.సత్తిరాజు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పెద్దంశెట్టి రామకృష్ణ, చొల్లంగి వేణుగోపాల్ పాల్గొన్నారు.

రౌంట్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ధర్మారెడ్డి

మోకాళ్లపై నిల్చొని నిరసన

ప్రజాశక్తి - కాకినాడ

ఎస్ఎస్ఎ ఉద్యోగులు మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. వారు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 5వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా జెఎసి అధ్యక్షులు ఎం.చంటిబాబు, జిల్లా కార్యదర్శి ఎ.సత్యనాగమణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు అందించే అమ్మఒడి, విద్యాదీవెన, నాడు నేడు వంటి పథకాలను విజయవంతం చేయడంలో సమగ్రశిక్ష ఉద్యోగుల పాత్ర కీలకమైనదన్నారు. జగన్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతంలో అమలు చేసే ప్రతి పథకాన్ని దగ్గరుండి విజయవంతం చేస్తున్న ఉద్యోగులను తన రాజకీయ అవసరాలకు ఉపయోగించుకుని, జీతాలు పెంచమనే సరికి రోడ్డున పడేయడం దారుణమన్నారు. తక్షణం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, అసెంబ్లీ సాక్షిగా జగన్మోహన్ రెడ్డి చెప్పినట్లుగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం సమ్మె శిబిరానికి యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, చక్రవర్తి, ఎస్.గోవింద రాజులు, డి.కనకదుర్గా, కె.వి.వి నాగేశ్వరరావు, సామర్లకోట ఎంఇఒ శివరామకృష్ణ, పెద్దాపురం ఎంఇఒ చౌదరి, జె.రమణ, ఎంఇఒ -1 బి.కృష్ణవేణి, ఎంఇఒ 2 పి.సత్యన్నారాయణ, బహుజన టీచర్స్ ఫెడరేషన్ నాయకులు బొజ్జా శరత్, ఎపి స్కూల్ టీచర్స్ యూనియన్ నాయకులు చలపతి మద్దతు తెలిపి ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జెఎసి జిల్లా ఉపాధ్యక్షులు పివివి మహాలక్ష్మి, ఎ.లోవరాజు, సహాయ కార్యదర్శులు జి.నారాయణ, శ్రీనివాస్, జిల్లా కోశాధికారి పి.రాజు, ఎం.గంగాధర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

వాలంటీర్‌కు ఇచ్చే విలువ సర్పంచ్‌కి లేదు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

వైసిపి ప్రభుత్వంలో గ్రామ, వార్డు వాలంటీర్‌కి ఇచ్చే విలువ గ్రామ సర్పంచులకు లేకుండా పోయిందని ఎపి పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌సి వైవిబి. రాజేంద్రప్రసాద్ విమర్శించారు. ఆదివారం మండలంలోని పనసపాడు గ్రామంలో సర్పంచ్ల సమర శంఖారావం పేరిట ప్రత్యేక సమావేశం జరిగింది. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరి బాబు రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వాలంటీర్‌కి ఇచ్చే వేతనంగాని, గౌరవంగాని ప్రజలచే ఎన్నుకున్న సర్పంచ్‌లకు దక్కక పోవడం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు పాలనలో పంచాయతీరాజ్ మంత్రిగా లోకేష్ పంచాయతీల అభివృద్ధికి సిసి రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు వెలిగించి గ్రామాల అభివీద్ధికి శ్రీకారం చుడితే వైసిపి ప్రభుత్వం నిధులన్నీ లాక్కొని సర్పంచులను ఉత్సవిగ్రహాలుగా మార్చిందన్నారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పనసపాడు సర్పంచ్ వెంకటేష్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్ల సమాఖ్య అధ్యక్షురాలు శాంత కుమారి, కాకినాడ జిల్లా అధ్యక్షుడు రాజా, ఎపి పంచాయతీ ఛాంబర్ ఉపాధ్యక్షుడు వినోదరాజు, విశాఖ జిల్లా పంచాయతీల సమాఖ్య అధ్యక్షుడు చింత కాయల ముత్యాలు, ఎపి పంచాయతీ కార్యదర్శి సలాది బుచ్చి రాజు, తిరుపతి సర్పంచ్ బొబ్బా ప్రభాత్ కుమార్, వాలుతిమ్మాపురం సర్పంచ్ సాల్మన్ రాజు, వికె రాయపురం ఉప సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, పెద్దాపురం మండల మాజీ సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోత్తిం కోటి, విశ్వేశ్వరావు, యేలిశెట్టి నాని, అడ బాల కుమారస్వామి, బలుసు వాసు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

నేరాలు ఘోరాలు

పేకాడుతున్న నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

మండలంలోని వేట్లపాలెం గ్రామం మంగయ్యమ్మ కాలనీలో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేయడంతోపాటు వారి నుంచి రూ.23,070 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సామర్లకోట సిఐ సురేష్ చెప్పారు. రాబడిన సమాచారం మేరకు ఆదివారం వేకువజామున తన సిబ్బందితో కలిసి ఆకస్మికదాడులు నిర్వహించి వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిని సోమవారం కోర్టుకు తరలిస్తామన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం పట్టణం గాంధీనగర్‌కు చెందిన కుంపట్ల లక్ష్మణ నరసింహారావు(63) ఇంటి వెనుకవైపు ఉన్న భవనంలోని 1వ అంతస్తులో సీతాఫలం కోస్తుండగా ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కిందపడి తలపై తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం అమలాపురంలోని శ్రీనిధి ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడలోని మెడికోవర్ ఆసుపత్రిలో చేర్పించారు. కాకినాడ ఆసుపత్రిలో చికిత్సను అందిస్తున్నారు. అయితే పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. పట్టణ పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్తంభాన్ని ఢీకొన్న ట్రావెల్ బస్సు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ట్రావెల్ బస్సు ఆదివారం ఢీకొంది. వివరాలు ఇవి.. విశాఖపట్నం. గాజువాక స్టీల్‌ప్లాంట్ వాసులు విహార యాత్రకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం మండలంలో ర్యాలీ జగన్మోహిని కేశవ స్వామిని దర్శించుకునేందుకు వచ్చారు. ఈ సమయంలో ఎదురుగా వస్తున్న లారీకి సైడ్ ఇచ్చేందుకు రోడ్డుసైడ్‌కి బస్సు వచ్చింది. అయితే అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బస్సు ఢీకొంది. దీంతో స్తంభ విరిగిపోయి 33 కెవి.వైర్లు తెగిపడి బస్సును తాకాయి. దీంతో మంటలు చెలరేగడంతో బస్సులో ఉన్నవారు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఈ సమయంలో విద్యుత్ సరఫరా అయ్యే ఇన్‌పుట్ వైరు తెగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సులో ఉన్న 50 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

పంటబోదెలోకి దూసుకెళ్లిన లారీ

ప్రజాశక్తి - గోపాలపురం

నేషనల్ హైవేపై వెళుతున్న లారీ అదుపుతప్పి పంట బోదెలోకి దూసుకుపోయింది. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున కరిచర్లగూడెం శివారులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విశాఖ నుంచి నాగపూర్‌కు ఐరన్ లోడ్‌లో లారీ వెళ్తోంది. లారీ మండలంలోని కరిచర్ల గూడెం శివారు ఓంకార్ ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీ సమీపానికి వచ్చేసరికి అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ఘటనలో లారీ క్యాబిన్ నుజ్జునుజ్జు అయ్యింది. డ్రైవర్ కేబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. సుమారు మూడు గంటల పాటు అవస్థలు పడ్డాడు. పోలీసులు అతన్ని కాపాడి 108లో గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. కేబిన్‌లో డ్రైవర్‌తో పాటూ మరో ఇద్దరు ఉన్నారు. వారు గాయాలతో బయటపడ్డారు.

కేటిసి హాస్టల్ విద్యార్థి అదృశ్యం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

మండలంలోని అచ్చంపేట శివారు బ్రహ్మానందపురం గ్రామంలో నిర్వహిస్తున్న ట్రాన్ఫర్మేషన్ సెంటర్ (కెటిసి) విద్యాసంస్థ హాస్టల్‌లో 8వ తరగతి విద్యార్థి జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రాజ్ వోరస్ అదృశ్యమయ్యాడు. ఈ మేరకు హాస్టల్ ఇన్‌ఛార్జ్ విద్యార్థి అదృశ్యంపై సామర్లకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం నుంచి రాజ్‌వోరస్ కనిపించడం లేదని ఆచూకీ తెలిసినవారు సామర్లకోట పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సిఐ సురేష్ కోరారు.

ఆరు నెలల బాలుడికి కరోనా పాజిటివ్

ప్రజాశక్తి - పెద్దాపురం

కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మండలంలోని చిన్న బ్రహ్మదేవం గ్రామం లో ఆరు నెలల బాలుడికి కరోనా పాజిటివ్ రావడంతో గ్రామంలో తీవ్ర ఆందోళన నెలకొంది. వారం రోజుల క్రితం ఈ బాలుడు దగ్గు, రొంప న్యూమోనియా లక్షణాలతో బాధపడగా కాకినాడ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అక్కడ అన్ని రకాల పరీక్షలు చేసి వైద్య సేవలు అందించారు. బాలుడికి నయమై ఆదివారం ఇంటికి రాగా ఇంటికి వచ్చిన మూడు గంటల అనంతరం కరోనా పాజిటివ్ వచ్చినట్లు పెద్దాపురం వైద్యాధికారులకు సమాచారం అందింది. దీంతో కాండ్రకోట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఉషా ప్రియదర్శిని ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది హుటాహుటిని చిన్న బ్రహ్మదేవం గ్రామం వెళ్లి బాలుడు కుటుంబ సభ్యులు ఐదుగురుకి కరోనా వైద్య పరీక్షలు నిర్వహించి హోమ్ ఐసోలేషన్లో పెట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషా ప్రియదర్శిని మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ అనారోగ్యంతో ఉన్న వారి వివరాలు సేకరిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారన్నారు. దగ్గు, రొంప ఉన్నవారు కోవిడ్ టెస్టులు చేయించుకోవాలన్నారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది రంగంలోకి దిగి గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు.

టిడిపి పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం

ప్రజాశక్తి - పిఠాపురం

కరపత్రాలను పంపిణీ చేస్తున్న వర్మ

టిడిపి పాలనలోనే అభివృద్ధి జరిగిందని మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్ వర్మ అన్నారు. మండలంలోని చిత్రాడ గ్రామంలోని ఇబిసి కాలనీలో ఆదివారం మన ఇంటికి మన వర్మ, బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్నీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన ఆయన టిడిపి మినీ మ్యేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ సుమారు రూ.3 కోట్లతో చిత్రాడ గ్రామాన్ని తమ పాలనలో అభివృద్ధి చేశామని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో గ్రామంలో తట్టడు మట్టి కూడా వేయలేదన్నారు. ఇళ్ల స్థలాల పేరుతో దొంగపట్టాలు ఇచ్చిన వైసిపి కార్యకర్తలు ప్రజల సొమ్మును దోచుకుతిన్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గంగాధర్, కేతవరపు సత్యయేసుకృష్ణ, శివ, శ్రీను, బాబులు మాజీ జడ్‌పిటిసి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పాలకుల విధానాలవల్లే రైతులకు తిప్పలు

ప్రజాశక్తి - కాజులూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్లే రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు దుగ్గుదూరు సామాజిక కార్యకర్త కడలి రాంపండు అధ్యక్షతన దుగ్గుదుర్రులో కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు రైతులను దివాలా తీసే విధంగా ఉన్నాయని, ఒకపక్క పెరిగిన ఎరువులు, పురుగుమందులు, డీజిల్ ధరలు పెరగడంతో పెట్టుబడి అధికమైందన్నారు. మరోపక్క గిట్టుబాటు ధరలు లేక రైతు నష్టపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. మద్దతు ధర రాకపోవడం, మరోపక్క ప్రకృతి సృష్టిస్తున్న విలయం వల్ల రైతులు అప్పుల పాలౌతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సువ్వారి గోవిందు, అల్లాడి నరసింహమూర్తి, నామ చంద్రరావు, కురుపూడి భూచక్రం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దంత వైద్యుల దినోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ దంత వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ భారతదేశంలో ఆధునిక దంత వైద్యానికి పితామహుడైన డాక్టర్ రఫీదున్ అహ్మద్ 1890 డిసెంబర్ 24న జన్మించడంతో అప్పటి నుంచి ఆయన జయంతిన జాతీయ దంత వైద్యుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. నోటి ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యత, నోటి ఆరోగ్యాన్ని చక్కగా ఉంచడంలో దంత వైద్యుని పాత్ర కీలకమన్నారు. విశ్రాంతి ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ సందర్భంగా అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, డాక్టర్ సువర్ణ రాజులను సాయి కార్తీక్‌లను ఘనంగా సత్కరించారు.

యానాం వార్తలు

నేడు యానాంలో పర్యటించనున్న కేంద్రమంత్రి

ప్రజాశక్తి - యానాం

కేంద్ర సంక్షేమ పథకాలను ప్రచారం చేసేందుకు వికసిత్ భారత్ సంకల్పయాత్రలో కేంద్రమంత్రి మురుగన్, పుదుచ్చేరి రాజ్యసభ సభ్యులు సెల్వ గణపతి, పుదుచ్చేరి స్పీకర్ ఆర్ సెల్వం, పుదుచ్చేరి కలెక్టర్ వల్లవన్‌లు పాల్గొనున్నట్లు ఆర్ఎఒ మునిస్వామి తెలిపారు. సోమవారం యానంలో పర్యటించి పలు కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు. స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆధ్వర్యంలో స్థానిక ఫెర్రీ రోడ్లో ఉన్న జివిఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న సభలో పుదుచ్చేరి నుంచి వచ్చే ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

రామస్వామికి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

పెరియార్ ఇవి రామస్వామి వర్ధంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఎఎస్ఐ రమణమూర్తి, కెఎల్‌వి ప్రసాద్, కానిస్టేబుల్ మారేళ్ల ఆది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక ఎయిమ్స్ ఫర్ సేవా ఆశ్రమం విద్యార్థులకు యుటిఎఫ్ సీనియర్ నేత, విశ్రాంత ఉపాధ్యాయులు మెతకాని రాంబాబు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ త్రివేణి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటాల్లో ముందు ఉండడమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న రాంబాబు మాష్టారు సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల నాయకులు జట్ల సోమరాజు, ఎస్ రాజశేఖర్, జె.అప్పారావు, టి.హరిచంద్రప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అంతర్ కళాశాల ఈత పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ప్రాంగణంలో ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల ఈత పోటీలు ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగాయి. పిఠాపురం సూర్య రాయ డిగ్రీ కళాశాల ఛైర్మన్ మహమ్మద్ అబి బాషా ఆధ్వర్యంలో ఈ ఆక్వు స్విమ్మింగ్ సెలక్షన్స్ జరిగాయి. ఈ ఈత పోటీలలో 16 రకాల ఈవెంట్స్ నిర్వహించగా మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు విజేతలుగా నిలిచి సౌత్ జోన్ పోటీలలో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. ఈ ఎనిమిది మంది జనవరి 2 నుంచి 4 వరకూ చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించబడే సౌత్ జోన్ పోటీలలో పాల్గొంటారని మహమ్మద్ హబీబ్ భాష తెలిపారు. ఈ స్విమ్మింగ్ పోటీల కోసం ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి డాక్టర్ రామ్ గోపాల్‌ను ముఖ్య పరిశీలకుడుగా నియమించారు.

క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన చర్చ్‌లు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

శాంతి సహనానికి ప్రత్యేకమైన ఏసుక్రీస్తు జన్మదిన పురస్కరించుకుని నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు సామర్లకోట పట్టణ మండల పరిధిలో చర్చిలు సిద్ధమయ్యాయి. నిర్వాహకులు వీటిని విద్యుత్ దీపాల అలంకరణలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పట్టణ మండల పరిధిలో సుమారు 110కిపైగా చర్చిలు ఉన్నాయి. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్దఎత్తున ప్రార్ధనలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయా చర్చిల పాస్టర్లు తెలిపారు. సుమారు నెలరోజులు ముందుగా క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు ప్రారంభించారు. వారి వారి గృహాలపై నక్షత్రాలను వెలిగించి పశువుల పాకలను సిద్ధం చేసి క్రిస్మస్ వేడుకలకు శ్రీకారం చుట్టారు. 114 సంవత్సరాలు చరిత్ర కలిగిన సెంటనరీ అగస్థానా లూథరన్ చర్చ్ ఆర్‌సిఎం దేవాలయం ఆంధ్ర బాప్టిస్ట్ చర్చ్ తదితర చర్చ్‌లలో నెల రోజులు ముందు నుంచే క్రైస్తవులు సందడిని ప్రారంభించారు. సోమవారం జరిగే క్రిస్మస్ వేడుకల్లో మండల పట్టణ పరిధిలో వేలాది మంది క్రైస్తవ సోదరులు పాల్గొననున్నారు.

వేడుకలకు సిద్ధమైన ఆర్‌సిఎం చర్చ్

మరిడమ్మకు ముక్కు పుడక సమర్పణ

ప్రజాశక్తి - పెద్దాపురం

ముక్కుపుడకను అందికుంటున్న ఎసి

స్థానిక మరిడమ్మ అమ్మవారికి ఆదివారం పెద్దాపురం పట్టణానికి చెందిన కొంగర కిషోర్ దంపతులు రూ.లక్ష విలువ చేసే బంగారు ముక్కు పుడకను సమర్పించారు. ఈ ముక్కుపుడకను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామ్మోహన్‌రావుకు అందజేశారు. ఈ సందర్భంగా వేద పండితులు ఎన్‌వి.శాస్త్రి, శంకర్, ఆలయ ఆశాది రాయి. రామచంద్రప్రసాద్‌లు ఆశీర్వచనాలతో అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF I ADDL. SENIOR CIVIL JUDGE: KAKINADA
I.P.NO.42/2023
Between:
Kadiyala Nagavalli, W/o. Khaja Mohammad Najeeruddin, D/o. Kadiyala Ganni Raju, aged 46 years, D.No.11-141, Drivers Colony, Toorangi Village, Kakinada Rural Mandal ...Petitioner
And
B.B.N. Singh & 4 Others ...Respondents
To Respondents:
1) B.B.N. Singh, S/o. Subbu Singh, aged 58 yrs., D.No.57-7-18, Nookalamma Gudi Veedhi, Opp. Jagannaickpur, Kakinada Urban.
2) Jami Santhi Raju, S/o. Satyanarayana, aged 43 yrs., D.No.11-137, Pagadalapeta, Yanam Road, Toorangi, Kakinada Rural.
3) Geddada Durga Devi, W/o. Srinivas, aged 42 yrs., D.No.2-285, Road No.14, Adarsha Nagar, Cheediga Village, Kakinada Rural.
4) Osupalli Danayya, S/o. late Danayya, aged 50 yrs., D.No.11-316, Pagadalapeta, Toorangi Village, Kakinada Rural.
5) Vitthanala Satyanarayana, S/o. Achharao, aged 56 yrs., D.No.1-5, Ramalayam Street, P.Venkatapuram, Panduru.
పై నెంబరు పిటిషన్‌లో పిటిషనర్ తనను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుచూ పై కోర్టువారి ఎదుట పిటిషన్ దాఖలు చేసి యున్నారు. కావున సదరు పిటిషన్‌లో చూపించిన రెస్పాండెంట్స్ మరియు ఇతర బాకీదారులు ఎవరైనా ఉన్నచో పై శ్రీ కోర్టువారి ఎదుట ది.**02-01-2024** తేదీన ఉదయం **10.30** ని॥లకు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలియపరచుకొనవలెను.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
K.V.V.S.N.MURTHY
V. PAVANI, Advocate
D.No.52-1-66, Narasimha Road
Near Annammaghati Centre
Jagannaickpur, Kakinada - 2
Cell: 9949394515

జి రాగంపేటలో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

వైద్య సేవలందిస్తున్న వైద్య బృందం

మండలంలోని జి రాగంపేట గ్రామంలో ఆదివారం లయన్స్ క్లబ్ సంకల్ప ఆధ్వర్యంలో నారి మనోరంజన్ ఉత్సవ పేరుతో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలతోపాటు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. లైన్స్ క్లబ్ ఛైర్మన్ మెట్టా రాధా, మిత్రబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో సర్పంచ్ బుంగా శేఖర్ బాబు, మన ఊరు టీం సభ్యులు జలధాని సుబ్రహ్మణ్యం, మోటూరి వీరబాబు, ఎన్ కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

'నాగజాతీయుల మాతృభాష ఏది' గ్రంథం ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

భారతీయ బౌద్ధ మహా సభ (బిఎస్ఐ) కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన బౌద్ధ సదస్సులో ప్రముఖ పరిశోధనాత్మక రచయిత వజ్రపు సాంబమూర్తి రచించిన 'నాగజాతీయుల మాతృభాష ఏది' అనే గ్రంథాన్ని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి ఆవిష్కరించారు. గ్రంథాన్ని సంక్షిప్త పరిచయం చేశారు. డాక్టర్ వైఎస్ఆర్ వైద్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.బాబ్జి, స్నేహ హాస్పిటల్ అధినేత డాక్టర్ రామ్ స్వరూప్‌జవహర్, ఎ.రామేశ్వర రావు, జనచైతన్య మండలి వ్యవస్థాపకులు పెయ్యల పావన్‌ప్రసాద్, బిఎస్ఐ అధ్యక్షులు జీ.శ్రీరాములు, ట్రెజరర్ పి.రాంప్రసాద్, మనిసింగ్, సాంబమూర్తి కుమార్తె అనిల, శరత్ బాబు, బొజ్జా అశోక్ తదితరులు ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న స్వరూపరాణి తదితరులు

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
I.A.546/2023 in O.S.94/2015
Between:
Darbe Sundar ...*Petitioner/Plaintiff*
And
Jetty Annapurna And Others ...*Respondents/Defendants*
To.
Kola Satya Gowri,
D/o.Late Satyanarayana, R/o.D.No. 45-44-17, Ambedkar Nagar, Rajamahendravaram, E.G.Dist. ...*6th Respondent/Defendant*
పై నంబరు గ్రంథములో 6వ రెస్పాండెంటు / ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు / నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పవేయుచున్నారు. కావున ది.09-01-2024 సం॥రం తేదీన ఉదయం గం.10.30 ని॥లకు మీరు స్వయంగా గాని ప్లీడరు ద్వారా గాని హాజరు అయ్యి సదరు పై గ్రంథములో మీ ఆక్షేపణలను తెలుపుకోగలరు. లేనిఎడల సదరు గ్రంథము మీకు పరోక్షముగా శ్రీకోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
జి.ఎస్.ఎస్.మురళీమోహన్
రాజమండ్రి జి.వి.రామలక్ష్మి, అడ్వకేట్స్
25-12-2023 రాజమండ్రి.

జెఎన్‌టియుకె ఫుట్ బాల్ టీమ్‌లో ఆదిత్య విద్యార్థులు

విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఇతరులు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన ఎండి. శాంటో, లీలా వరప్రసాద్‌లు జెఎన్‌టియుకె ఫుట్ బాల్ టీమ్‌కు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డోలా సంజయ్ తెలిపారు. ఈ నెల 25 నుంచి 30 వరకూ తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలోని ఎస్ఆర్ఎం ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో నిర్వహిస్తున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఫుట్ బాల్ టోర్నమెం ట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఎరి.శాంటో, లీలా వరప్రసాద్ లను ప్రిన్సిపల్, డీన్. డాక్టర్ ఎ.రామ కృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ అభినందనలు తెలిపారు.

వైసిపి యువజన విభాగం అధ్యక్షునిగా లోవరాజు

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మండల వైసిపి యువజన విభాగం అధ్యక్షునిగా పి.మల్లవరం పత్తిగొంది గ్రామానికి చెందిన మట్టపర్తి లోవరాజు నియమితులయ్యారు. ఈ సందర్భం గా లోవరాజు స్థానిక విలేకరులతో ఆదివారం మాట్లాడారు. తనకు బాధ్యతలు అప్పగించిన ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో మండలంలోని యువతను సమీకరించి పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు.

క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగాలు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రభుత్వం గుర్తించిన క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగాలు పొందవచ్చుని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ సూచించారు. ఆదివారం జిల్లా తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో వివిధ స్థాయిల్లో బెల్ట్ పరీక్షలు స్థానిక శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్, ఒలింపిక్ సంఘ చీఫ్ ప్యాట్రన్ కర్రి భామిరెడ్డి, ఎస్‌జిఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి బివివి ఎస్‌వి. ప్రసాద్‌రాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌డిఒ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తింపు పొందిన క్రీడలలో రాణించడం ద్వారా రెండు శాతం రిజర్వేషన్‌తో ప్రభుత్వ ఉద్యోగాలు పొందవచ్చన్నారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసిన గ్రామస్థాయి సచివాలయ వ్యవస్థలో సుమారు 2,500 మంది స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందారన్నారు. కర్రి భామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు ఏదో ఒక క్రీడలో పాల్గొనడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. క్రీడలను చిన్నప్పటి నుంచి ఆడుతూ ఉండాలన్నారు. ప్రసాద్‌రాజు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు తైక్వాండో శిక్షణ ఇచ్చే విధంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయి రిఫరీలు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భామిరెడ్డి

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.A.94/2023, E.P.64/2017
O.S.263/2012
Between:
పిటీషనరు / DHr :
శ్రీ విజయదుర్గ ఫైనాన్స్, నిడదవోలు.
Rep by its మేనేజింగ్ పార్టనర్,
శ్రీ కొనిజేటి వెంకట సుబ్బారావు,
S/o.బాలకొండయ్య, హిందు, పురుషుడు
బిజినెస్, R/o.D.No.7-1-5/1, గణపతి సెంటర్,
నిడదవోలు, తూ.గో.జిల్లా NDDJCJC Limits.
Vs
రెస్పాండెంట్లు / JDrs :
1.గుంటూరు సామ్రాజ్యం
2.గుంటూరు సత్యనారాయణరెడ్డి
3.గుంటూరు శ్రీనివాసులు రెడ్డి
4.గుంటూరు తిరుమలరెడ్డి
To.
4వ రెస్పాండెంటు: గుంటూరు తిరుమలరెడ్డి, S/o.సత్యనారాయణరెడ్డి, ప్రైవేటు ఎంప్లాయి, కుమ్మర్ల వీధి, నిడదవోలు, నిడదవోలు మండలం, తూ.గో.జిల్లా.
పై నెంబరు పిటిషనులో చనిపోయిన 1వ రెస్పాండెంటు స్థానే ఆమె వారసులుగా 4వ రెస్పాండెంటుకు శ్రీకోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ 4వ రెస్పాండెంటు నోటీసు తీసుకొని ఉండలేదు. కాబట్టి పై నెంబరు పిటిషనులో 4వ రెస్పాండెంటుకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్ననూ పై కోర్టు వారి ఎదుట ది.4-1-2024 తేదీన ఉదయం గం.10.30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున పిటిషను తీర్మానించబడునని యందుమూలముగా మీకు తెలయజేయడమైనది.
ఎస్.సుబ్బారావు
కొవ్వూరు. అడ్వకేట్, కొవ్వూరు.
తేది.18-12-23 సెల్: 9492917811

IN THE COURT OF THE VI ADDL. DISTRICT JUDGE :: KAKINADA
G.O.P. No. 77 / 2023
(Being Minor, rep. by their mother and natural gaurdian **Smt. Srungavarapu Vijay Krishna**)
Between:
Smt. Srungavarapu Vijaya Krishna, W/o. Late Ravi Kumar, aged 44 yrs., Housewife, D.No.5-15-55/1, Ward No.16, Durgadas Street, Tuni - 533401, Kakinada District
(In the matter of minors
(1) Srungavarapu Divyans, S/o. Late Ravi Kumar, aged 16 yrs., Student, D.No.5-15-55/1, Ward No.16, Durgadas Street, Tuni - 533401, Kakinada District
(2) Kum. Srungavarapu Sai Dharan, D/o. Late Ravi Kumar, aged 14 yrs., Student D.No.5-15-55/1, Ward No.16, Durgadas Street, Tuni - 533401, Kakinada District ...Petitioner
and
Nil ...Resondent
పై నెంబరు పిటిషన్‌లో పిటిషనర్ గారి కుమారుడు మరియు కమార్తె (1) Srungavarapu Divyans, (2) Srungavarapu Sai Dharan మైనర్లు అయినందున పిటిషనర్ Smt. Srungavarapu Vijaya Krishna గార్డియన్ అయి ఉండి, సదరు మైనర్లకు చదువు మరియు ఇతర ఖర్చుల నిమిత్తం ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిలో 2/4వ వంతు అమ్ముట కొరకై 3వ పార్టీ అత్తిలి శ్రీరామ్, S/o. ప్రబాకర రావు గారు కొనుగోలు చేయుటకు ముందుకు వచ్చి అగ్రిమెంటు కుదుర్చుకొని యున్నందున పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. కావున పైన తెల్పిన ఆస్థి విక్రయం గురించి ఎవరికైనా, ఏ విధమైన ఆక్షేపణలు లేదా అభ్యంతరములు ఉన్న యెడల ది.**11-01-2024** తేదీకి పైన తెల్పిన కోర్టులో ఉదయం **10.30** ని॥లకు హాజరయి ఆక్షేపణలు తెలియ జేయవలెను.
SCHEDULE: Kakinada District, Kakinada Rural Mandal, Samalkota Sub-Registry, Thimmapuram Grampanchayat, Thimmapuram Village, vacant site to an extent of 308 sq.yds. or 258.72 sq.mtrs., covered by R.S. No.346/3 & Patta No.411, bounded and measured as follows:
East: 41.6 ft. - Land of Jiyyana Subbayamma & others, **West:** 44.6 ft. - Land of Sunkara Venkata Ramana (Road), **South:** 64½ ft - Site sold by vendor to Srungarapu Srinivasu, **North:** 64½ ft - Layout Plots in L.P. No. 34/98. Within the above said boundaries, common ways, water sources with all easementary rights etc.
వేగుళ్ళ వెంకటరమణ మూర్తి,
వేగుళ్ళ భువనేశ్వరి, అడ్వకేట్స్
డో.నెం.9-4-4, గాంధీనగర్, కాకినాడ
సెల్: 9866033899

కాపులు అన్ని రంగాల్లో ముందుండాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాపులు అన్ని రంగాల్లోనూ ముందుండాలని పలువురు కాపు నాయకులు పిలుపునిచ్చారు. ఆంధ్ర కాపు సద్భావన సంఘం, కాపునాడు సంయుక్తంగా నిర్వహించిన ఆత్మీయ కాపు వనభోజన మహోత్సవం స్థానిక శుభం కాపు కళ్యాణ మండపంలో ఆదివారం సంఘం గౌరవ అధ్యక్షులు బసవ ప్రభాకర్ రావు, అధ్యక్షులు వాసిరెడ్డి ఏసుదాసు, ప్రధాన కార్యదర్శి చిట్నీటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపి వంగా గీతా విశ్వనాథ్, ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, మాజీ మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఎంఎల్ఎ వరుపుల సుబ్బారావు, పంతం నానాజీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాపులు అన్ని రంగాల్లో ముందుండాలని, అందర్నీ కలుపుకుని ముందుకు సాగాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారిని దుస్సాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కుడా ఛైర్మన్ చంద్రకళదీప్తి కుమార్, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, సుంకర పావని, కాపు జెఎసి నాయకులు ఎన్.విష్ణుమూర్తి, కె.తాతాజీ, ఎ.రామకృష్ణ, ముద్దాల అనుబాబు, ఆకుల వెంకటరమణపాల్గొన్నారు.

సిగార్ కార్మిక నాయకుడు ఖాదర్ మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వరహాలయ్య పేటకు చెందిన చుట్టల కార్మిక సంఘ నాయకుడు షేక్ ఖాదర్(60) ఆదివారం తెల్లవారుజామున గుండె పోటుతో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత 30 ఏళ్లుగా సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో చుట్టల కార్మిక సంఘ నిర్మాణంలో ఆయన తన వంతు పాత్ర పోషించారు. ఆయన మృతికి చుట్టల కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మరిడియ్య, ఏడుకొండలు, సంఘం నాయకులు ఎం.వెం కన్న, షేక్ చోటాబాబు, జె.వెంకన్న, సిఐటియు నాయకులు ఎన్.సూరిబాబు, డి.క్రాంతి కుమార్, జి.సత్తిబాబు, ప్రజానాట్యమండలి నాయకులు ఆర్.వీర్రాజు, డి.కృష్ణ, డి.సత్యనారాయణ, ఎం.రాంబాబు, జి.పెంటయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రభుత్వ పాఠశాలల్లోనే క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య అంతుందని ఎంఇఒ బి.అబ్బాయి అన్నారు. స్థానిక అంబేద్కర్ నగర్ ఎంపిపి పాఠశాల విద్యార్థులు నవోదయకు ఎంపిక కావడంతో వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఒకే పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు, కవలలు పిల్లల అబిలాష్, పిల్లల అభినవ్ నవోదయకు ఎంపిక అయ్యేలా శిక్షణను ఇచ్చిన ఉపాధ్యాయిని కె.దేవదేవి అభినందనీయురాలన్నారు. అభినందించిన వారిలో ఎంఇఒ-2 కారు వరలక్ష్మి, యుటిఎఫ్ ఉపాధ్యాయులు ఉన్నారు.

వెంకటేశ్వరరావుకు పితృవియోగం

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురు మండల ప్రజాశక్తి విలేకరి ఏడిద వెంకటేశ్వరరావుకు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి ఏడిద సత్యనారాయణమూర్తి(92) శనివారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతికి ప్రజాశక్తి రాజమహేంద్రవరం ఎడిషన్ మేనేజర్ డి.శ్రీనివాసరావు, జిల్లా కన్వీనర్ ఎన్.పావనమూర్తి, డెస్క్ ఇన్‌ఛార్జి ఎస్.విశ్వనాథ్ సంతాపం తెలిపారు. అలాగే మండలంలోని వివిధ పత్రికల విలేకర్లు, పలువురు నాయకులు సత్యనారాయణమూర్తి మృతికి సంతాపం తెలిపారు.

ఒరిజినల్ దస్తావేజు పోయినది
తూర్పు గోదావరి జిల్లా తాళ్ళపూడి మండలం మలకపల్లి గ్రామ కాపురస్థుడైన కొడమంచిలి బోబ్ గారి కుమారుడైన విజయ్ కుమార్ అను నా పేరున ది. 30-03-2013 తేదీన నా తండ్రి గారు తాళ్ళపూడి మండలం వేగేశ్వరపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోన 936/2013తో రిజిస్టర్ చేయించిన ఒరిజినల్ దస్తావేజు తీసుకొని ది. 18-12-2023వ తేదీన తాళ్ళపూడి లో గల స్టేట్ బ్యాంకుకు వెళ్ళు చుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఈ దస్తావేజు దొరికినవారు క్రింది చిరునామాకు సమాచారం అందించవలసిందిగా కోరుచున్నాము.
కొడమంచిలి విజయ్ కుమార్,
తండ్రి బోబ్, డోర్ నెం: 5/82,
మలకపల్లి. సెల్: 9948582229